కథ

# "సూపర్ సుబ్బారావు"



శ్రీమతి తాటికోల పద్మావతి

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి తొందరగా ఇంటికివచ్చాడు సుబ్బారావు. గబగబా డ్రస్ మార్చుకొని వెంటనే బయలుదేరాడు.

సుబ్బలక్ష్మీ అంటూ భార్యని పిలిచాడు. ఈ పూట నాకు ఇంట్లో వంట చేయకు. మా ఫ్రెండ్ వాళ్ల ఇంట్లో పార్టీకి వెళ్తున్నానంటూ వచ్చినంత హడావిడిగానే తిరిగి వెళ్ళిపోయాడు.

రేపు ప్రయాణం గురించి భర్తకి చెప్పాలని అనుకొన్న సుబ్బలక్ష్మి ఆ విషయాన్ని చెప్పలేక పోయింది. అమ్మా ఊరికి ఎప్పుడు వెళ్దాం అంటూ పిల్లలిద్దరూ మారాం చేశారు. రాత్రికి నాన్నగారు రాగానే చెబుతాను. బట్టలన్నీ సర్దేశి ఉంచుదాం. రేపు ఉదయం వెళ్దామంది. సరేనన్నారు పిల్లలు. వాళ్లకి భోజనం పెట్టి తొందరగా నిద్ర బుచ్చింది. పిల్లలకి స్కూలు సెలవులిచ్చి అపుడే రెండు రోజులై పోయింది. ఎలాగైనా రేపు బయలుదేరాలి. రోజులు గడిచేకొద్దీ ఇంటికి ఎవరైనా బంధువులు రావచ్చు. వేసవికాలం నీళ్ళ ఎద్దడి. వచ్చిన చుట్టాలందరికీ చాకిరీ చెయ్యలేక చావాలి. ఇంటికి ఎవరూ రాక ముందే ఎక్కడికైనా వెళ్ళిపోవాలనుకుంది సుబ్బ లక్ష్మి.

పార్టీ ముగించుకొని రాత్రి పదింటికి ఇంటికొచ్చాడు సుబ్బారావు. అప్పటికే పిల్లలు నిద్రపోయారు. పార్టీ బాగా జరిగిందా అడిగింది సుబ్బలక్ష్మి.

'తిన్నంత తిని పారేసినంత పారేశారు. రకరకాల

ఐయిటమ్స్ చేయిం చారు. బ్రహ్మాండంగా జరిగిందని చెప్పాడు.

రేపు ఉదయం పిల్లలు నేను ఊరు వెళదామనుకొంటున్నాను. నేను వచ్చేవరకూ ఇల్లు జాగ్రత్తగా చూసుకోండి.

నాలుగురోజుల్లో మాపిన్ని బాబాయి వాళ్ళ పిల్లలు వస్తామన్నారు. ఊరు చూడాలట. ఇపుడునువ్వు వెళితే ఎట్లా. వాళ్ళు వచ్చినపుడు లేకుండా వెళతావా. తర్వాత వెళ్ళవచ్చులే !

అదేం కుదరదు. రేపు కనుక వెళ్ళకపోతే కొంపలంటుకుపోతాయి. వాళ్ళంతా వచ్చి మన ఇంటిమీద పడి ఇల్లంతా గుల్లచేస్తారు. అసలే నీళ్ళు దొరకడం కష్టంగా ఉంది. తెల్లవారు ఝామున నాలుగ్గంటలకే లేచి నీళ్ళు పట్టుకోవాలి. కాస్త బద్ధకిస్తే ఆ రోజు నీళ్ళుండవు. బిందెలు తీసుకొని బయటికి పోవాలి. ఇరవైనాలుగ్గంటలు ఫ్యాన్లు వేస్తారు. కరెంటు బోలెడంత ఖర్చవుతుంది.వాళ్ళు వచ్చినప్పటినుంచి మర్యాదలు చేయలేక నేను చావాలి. అక్కడికెళదాం, ఇక్కడికెళదాం అంటూ రోజూ ఏదో ఒక చోటుకి తీసికెళ్ళమని డబ్బు ఖర్చుపెట్టిస్తారు. ఎందుకొచ్చిన గొడవ, వాళ్ళు రాకముందే వెళ్ళాలి.

అదికాదు సుబ్బలక్ష్మీ నా మాట విను. ఈసారికి నీ ప్రయాణం వాయిదా వేసుకో.అంతగా అయితే వాళ్ళు వెళ్ళిపోయాక వెళుదువుగాని అన్నాడు.

మీరెన్నయినా చెప్పండి. నేను పిల్లలు రేపు వెళ్ళి తీరాల్సిందే. వాళ్ళకి ముందే ఫోన్ చేసి చెప్పండి. నేను మాత్రం వెళ్ళేది ఖాయం అంటూ తన అభిప్రాయాన్ని తెగేసి మరీ చెప్పింది. హతావిధీ అంటూ తలపట్టుకొన్నాడు సుబ్బారావు.

మర్నాడు ఉదయం అనుకొన్నట్లుగా సుబ్బలక్ష్మి పిల్లల్ని తీసుకొని పుట్టింటికి బయలుదేరింది. ఆ రోజంతా అమ్మానాన్నతో సరదాగా మాట్లాడటం గడిచిపోయింది. రెండు రోజుల తర్వాత హైదరాబాద్ నుంచి చెల్లెలు, ఆమె భర్త ఇద్దరు పిల్లలు దిగారు. నలుగురు పిల్లలు ఒకచోట చేరేసరికి సందడే సందడి. వాళ్ళు చేసే అల్లరి ఇంతా అంతా గాదు. క్రికెట్ ఆడి బంతులేసి కిటికీ అద్దాలు తలుపులు వగలగొట్టటం పెరట్లో చెట్లెక్కి మామిడికాయలు కోసి, ఉప్పుకారం అద్దుకొని తినటం జామపిందెలు కోసి కొరికి పారేయటం ఆటలన్నీ అయిపోగానే టివిముందు చేరి పెద్ద పెద్ద సౌండ్లు పెట్టి కేకలు పెట్టటం. ఇల్లంతా ఒక సత్రంలా తయారైంది.

కూతుళ్ళిద్దరూ వచ్చారుగదా అని వడియాలు పెట్టింది సుభద్రమ్మ. అది పెట్టిన అరగంటకే ఉన్నట్లుండి పెద్దగాలి దుమారం వచ్చి తలుపులు, కిటికీలు విసిరేసిరి కొట్టుకొన్నాయి. పెద్ద వర్షం మొదలైంది. వడియాలన్నీ తడిసి పోయినాయి. తీసే వ్యవధి కూడా లేకుండా పోయింది, సాయంత్రం దాకా వడగళ్ళ వర్షం కురిసింది.

ఒరే ! రారా వడగళ్ళు ఏరుకొందామంటూ పిల్లలంతా తలా ఒక గిన్నె చేత బుచ్చుకొని మంచుముక్కలు ఏరుకొంటున్నారు. ఆ వర్షంలో తడిసి సుబ్బలక్ష్మి పిల్లలకి జ్వరం పట్టుకొంది.

అక్కా మేం బయటికెళ్తున్నాం సరదాగా. పాపం నువ్వు పిల్లల్ని వదిలి రాలేవుగా అంటూ చెల్లెలు సరోజ భర్త పిల్లలతో కలిసి షికార్లు వెళుతుంటే ఛీ మాయదారి జ్వరం పిల్లలకి ఇపుడే రావాలా అంటూ విసుక్కొనేది.

అబ్బా ! నడుంనొప్పిగా ఉంది, ఇంతమందికి వండాలంటే నా వల్ల కావటం లేదు. కాస్త ఆ కూరగాయలు తరుగు. ఈ బియ్యం కడుగు. ఆ బట్టలు ఆరినవి తియ్యమంటు సుభద్రమ్మ పనులన్నీ పెద్దకూతురు సుబ్బలక్ష్మికే చెప్పేది.

అన్నీ నాకే చెప్పాలా ! సరోజ ఖాళీగానే ఉంది గదా అంది.

అది అక్కడ చేసుకొని అలసిపోయి వచ్చింది. ఈ నాలుగురోజులన్నా విశ్రాంతి ఉంటుంది. దానికి మరీ చిన్న పిల్లలు గదా అంటూ చిన్న కూతురుని వెనకేసుకొని రావటంతో కోపం వచ్చింది సుబ్బలక్ష్మికి. చిన్నకూతురిని బాగా చూస్తున్నారు తనని సరిగా చూడటం లేదని బాధపడింది. పిల్లలు అల్లరిచేసినా తన పిల్లల్నే అరుస్తారు.

దీనికితోడు మర్నాడు పంపులు రాలేదు. కరెంటు లేదు ట్యాంక్‌లో ఒక చుక్కనీళ్ళు లేవు. ముందుగా అందరి స్నానాలు అయిపోయినాయి. పోయిన కరెంటు ఎపుడొస్తుందో తెలియదు. నీళ్ళు లేకపోతే పనులన్నీ ఆగిపోతాయి. బిందె తీసుకొని, ఎదురుగా ఉన్న బోరింగ్ దగ్గరకెళ్ళి నాలుగు బిందెలు తెచ్చేసరికి సుబ్బలక్ష్మి పనయిపోయింది. రెండో మనిషెవరూ సాయం రాలేదు. కాళ్ళు పట్టుకుపోయాయి. కదలలేక కూలబడిపోయింది, ఎందుకొచ్చానా అనుకొంటూ బాధపడింది.

పిల్లవాడికి ఒక పక్క జ్వరం. వళ్ళు కాలి పోతున్నది. ఎవరూ పట్టించుకోలేదు. ఒక ట్యాబ్లెట్ కూడా తెచ్చి వెయ్యలేదు. హాయిగా సెలవుల్లో పిల్లలతో గడపాలని వచ్చింది. ఇక్కడ జరిగే అవమానం బాధాకరంగా ఉంది.

సాయంత్రం అన్నా వదినా, చెల్లెలు భర్త పిల్లలు అంతా సినిమాకి బయలుదేరి వెళ్ళారు. మాట వరసకయినా తనని రమ్మనలేదు. పైగా మీ పిల్లవాడికి జ్వరంగా ఉంది నువ్వు ఇంట్లోనే ఉండమన్నారు.

రాత్రికి వాళ్ళంతా తిరిగి వచ్చేసరికి వంట చేసి రెడీగా ఉంచింది సుబ్బలక్ష్మి, రాత్రి పడుకోబోయే ముందు భర్త గుర్తుకు వచ్చాడు. వేళకింత వండుకొని తింటున్నారో లేదో, ఆయన మాట వినకుండా వచ్చేశాను. ఇక్కడ ఒక సరదా లేదు, సంతోషం లేదు, చాకిరీ ఎక్కువైంది. పుట్టిల్లని ఎగురుకొంటూ వచ్చాను. మనుపటిలా లేదు. ఇంతకుముందు ఎప్పుడొచ్చినా ఎంతో గౌరవించేవారు. ఇంకో నాలుగురోజులు ఉండమంటూ బ్రతిమలాడేవారు. ఇప్పుడు ఎందుకొచ్చానా అనిపిస్తున్నది.

షాపింగ్‌కి వెళ్ళేటపుడు మాటవరసకైనా తనని పిలవలేదు. సరోజ పిల్లలకి ఖరీదైన బట్టలు తీసుకొన్నారు. ఈ చీర నీకు బాగుంటుందని నేనే సెలెక్టు చేశానంటూ సరోజ లైట్ కలర్ కాటన్ చీర చూపించింది. అంత తక్కువ ఖరీదు చీర చూసేసరికి వళ్ళు మండింది. ఎన్నడూ లేనిది ఇంత అవమానకరం సిగ్గుచేటుగా ఉంది.

మర్నాడు ఉదయం సుబ్బలక్ష్మి పిల్లల్ని తీసుకొని బయలుదేరింది. ఎవరూ ఉండమనలేదు.

సుబ్బారావుతో పాటు ఇంట్లోఉన్న కొత్త వ్యక్తుల్ని చూసి ఆశ్చర్యపోయింది, అప్పుడే వచ్చారా ! మరో వారం రోజులుంటారను కొన్నా నన్నాడు. అక్కడి విషయాలేవీ బయటికి తెలియనీయ కుండా, మీకు భోజనానికి ఇబ్బంది అవుతుందని వచ్చానంది.

“మా పిన్నిబాబాయి పిల్లలు నిన్ననే వచ్చారు. ఇంటి పనంతా మా పిన్నే చూసుకొంటున్నది.

సుబ్బలక్ష్మి టిఫిన్ చేద్దువుగాని రామ్మా. పిల్లలకి పెట్టు. ఎపుడు బయలుదేరారో ఏమో అంటూ వేడి ఇడ్లీ, కారప్పొడి, చట్నీ వేసి తీసుకొచ్చి ఇచ్చింది.

సుబ్బలక్ష్మి వంట చేయబోతుంటే నీకెందుకమ్మా శ్రమ. నేను చేస్తాగా నేనున్న నాలుగురోజులు హాయిగా విశ్రాంతి తీసుకో ! రోజూ నువ్వే వండుకోవాలి, తినాలి. ఈ ఎండలకి బాగా చిక్కిపోయావు చూడు. నువ్వెళ్ళి పిల్లల పని చూసుకో వంట నేను చేస్తాలే అంది.

సుబ్బలక్ష్మికి నిజంగానే విశ్రాంతి లభించింది. సాయంత్రం కాగానే బజారుకి వెళ్ళేవారు. అంతా కలసి సరదాగా పార్కులు, ఎగ్జిబిషన్లు, వచ్చేటప్పుడు హోటల్లోనే భోజనాలు చేసి వచ్చేవారు. సుబ్బారావు జేబులోనుంచి ఒక్క రూపాయి ఖర్చు పెట్టనివ్వలేదు బాబాయి. పిల్లలకి ఏది కావాలంటే అది కొనివ్వటం, అమ్మాయికి ఏం కావాలో చూడవే అని భార్యకి చెప్పేవాడు. సుబ్బలక్ష్మికి వద్దన్నా వినకుండా గాజులు, పూలు చెప్పులు ఇలా రకరకాల ఐయిటమ్స్‌తో సంతృప్తి పరిచారు.

వాళ్ళున్న వారంరోజులు హాయిగా గడిచిపోయింది. తెల్లవారితే ప్రయాణమనగా ఏమండీ మీ పిన్ని, బాబాయికి బట్టలు పెట్టాలి. ఈ రోజు

సాయంత్రమే వెళ్ళేటపుడు తీసుకురమ్మని చెప్పింది. ఇప్పుడెందుకు ఖర్చు అన్నాడు సుబ్బారావు.

భలేవారండీ. వాళ్ళు రాక రాక ఇన్నాళ్ళకి మనింటికొచ్చారు. రోజు బయటికెళ్ళినపుడల్లా డబ్బంతా వాళ్ళే ఖర్చుపెట్టారు. మనం ఆ మాత్రం పెట్టకపోతే ఏం బాగుంటుంది. ఎలాగోలా మనం ఎడ్జెస్టు చేసుకొందాం అంది. భార్యలో వచ్చిన మార్పుకు సంతోషించాడు సుబ్బారావు.

మర్నాడు వాళ్ళందరికీ బట్టలు పెట్టారు. ఈసారి సెలవులకి తప్పకుండా మా ఊరు రావాలి. ఈసారికి మేం వచ్చాం. రోజులు సరదాగా గడిచి పోయినాయి. సుబ్బలక్ష్మి నీ ఆరోగ్యం జాగ్రత్తమ్మా అంటూ చెప్పి వెళ్ళారు. వాళ్ళు చూపిస్తున్న ఆదరాభిమానాలకి పొంగిపోయింది సుబ్బలక్ష్మి.

నిదానంగా పుట్టింట్లో జరిగిన అవమానం భర్తకి చెప్పింది. వాళ్ళంత వాళ్ళు రమ్మని పిలిచే వరకూ భీష్మించుకు కూర్చుంది. ఏమో అనుకొన్నాను. మీ వాళ్ళే నయం. మనింటికి వచ్చి మనకే మేలు చేశారు. నేనే వాళ్ళని అపార్ధం చేసుకొన్నాను. వచ్చిన వాళ్లందరికీ ఎక్కడ వండి పెట్టాల్సి వస్తుందో నని, డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తుందని బాధపడ్డాను. ఇలాంటి బంధువులు వస్తానంటే నేను మాత్రం వద్దంటానా అంది.

పాపం సుబ్బారావు చేసిన కిటుకు సుబ్బలక్ష్మికి తెలియదు. చివరికి బలైపోయింది సుబ్బారావే. భార్యకి తెలియకుండా వాళ్ళకి డబ్బులిచ్చి ఖర్చుపెట్టించింది సుబ్బారావే. సుబ్బారావు తరుపువాళ్ళు ఎవరైనా ఇంటికి వస్తే సరిగా చూడదు సుబ్బలక్ష్మి. వాళ్ళ ముందు తనకే అవమానం. ఏదో వంకతో వాళ్ళ ముందు గొడవ పెట్టుకొంటుంది, నాలుగు రోజులుందామనుకొని వచ్చిన వాళ్ళు రెండు రోజులకే తిరుగు ప్రయాణం అవుతారు. ఇదంతా ఇష్టంలేని సుబ్బారావు ముందుగా ప్లాన్‌ప్రకారం ఆడించిన నాటకం. సుబ్బారావు ఇచ్చిన సలహాతోనే పుట్టింట్లో కూడా సుబ్బలక్ష్మికి అవమానం ఎదురైంది. ఇదంతా సుబ్బలక్ష్మిలో మార్పు రావాలని ఆడిన నాటకం. ఎలాగైతేనేం సుబ్బలక్ష్మిలో మార్పు వచ్చింది. సుబ్బారావు సంతోషించాడు.


**చినుకు మాసపత్రికకు పంపే కథలు అచ్చులో 3 పేజీలకు మించకుండా పంపవలెను.**


మీ ఆలోచనలను అచ్చు వేయాలనుకుంటే

పోస్ట్‌ద్వారా గాని, ఫోన్‌ద్వారా గాని సంప్రదించండి.

అందంగా, గ్రంథంగా ప్రచురించి మీ కందిస్తాం

**చినుకు ప్రచురణలు**



**చినుకు ప్రచురణలు**

దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,

గాంధీనగర్, విజయవాడ - 520 003.

© 0866-6640595 , సెల్ : 98481 32208

Fax No. 0866-6697375 : E-mail : editor_chinuku@yahoo.com